# ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 26.0

ANDHRAJYOTHY


5








# పొరుగుకు పరుగు



మార్కెట్‌కు తరలిస్తున్న బేనీషా రకం మామిడి



జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేక మామిడి రైతులు పొరుగు రాష్ట్రాలకు పరుగులు పెడుతున్నారు. ఈనేపథ్యంలో రవాణా ఖర్చులు తడిసిమోపెడవడంతో పాటు దళారులు చేతిలో మోసపోవాల్సి వస్తోంది. గత కొన్నేళ్లుగా తెగుళ్లతో దిగుబడి రాక వచ్చిన అరకొర పంటకు గిట్టుబాటు ధరలేక మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈఏడాది కూడా మామిడి రైతులకు నిరాశే మిగులుతోంది.

- ఏటా లక్షల టన్నుల దిగుబడి
- అమ్మాలంటే పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిందే
- రైతు కష్టం దళారులు, రవాణా ఖర్చులకే
- నష్టాల్లో జిల్లా మామిడి రైతులు

పుట్టపర్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 21354 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. ఈఏడాది మామిడి పూత ఆలస్యంగా వచ్చింది. వివిధ తెగుళ్లు పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. ఈసారి పంట దిగుబడి లేకున్నా ధర మాత్రం ఆశించిన మేరకు పలకడం లేదు. జిల్లాలో వ్యాప్తంగా మామిడి సాగు ఉన్నా ప్రధానంగా బుక్కపట్నం, పుట్టపర్తి, నల్లమాడ, ఓడీసీ, తనకల్లు, ముదిగుబ్బ, గాండ్లపెంట, నంబులపూలకుంట, కొత్తచెరువు, కదిరి, పరిగి, లేపాక్షి, రొద్దం మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. బేనీషా, మల్లికా, తోతాపురి, రసగుల్ల, ఖాదర్ తదితర రకాలు పండిస్తున్నారు. ఇందులో 90శాతం బేనీషా మామిడి సాగులో ఉంది. ఈక్రమంలోనే బేనీషా పక్వానికి రావడంతో రంగున్న కాయలనే కోతవేసి విక్రయాలు మొదలు పెట్టారు. అయితే ఇటీవలి అకాల వర్షాలు, ఈదురు గాలులు మామిడి రైతులను కలవరపెడుతున్నాయి. వారం కిందటే జిల్లాలో మామిడి విక్రయాల మొదలయ్యాయి. మరో పది రోజుల్లో కోతలు భారీగా ఉండనున్నాయి. దిగుబడి, ధరలు బట్టి రైతుకు ఏమాత్రం మిగులుతుందో తెలిసే అవకాశం ఉంది.

## ఏటా లక్షల టన్నుల దిగుబడి

జిల్లాలో హెక్టారుకు 6నుంచి 8 టన్నుల దాకా మామిడి దిగుబడి వస్తుంది. ప్రతి ఏటా జిల్లాలో లక్ష టన్నుల దిగుబడి సాధిస్తున్నారు. పంటను విక్రయించాలంటే మాత్రం ప్రైవేట్ మార్కెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. మార్కెట్ సౌకర్యం లేకపోడంతో ప్రైవేట్ మండీలు, పొరుగు రాష్ట్రాలకు పరుగులు పెట్టాల్సివస్తోంది. ప్రధానంగా జిల్లాలో పండే మామిడిని జిల్లాలో నాలుగైదు మామిడి కొనుగోళ్ల మండీలతోపాటు బెంగళూరు, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలో నాగ్‌పూర్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల మార్కెట్లకు జిల్లా నుంచి ప్రతి ఏటా రవాణా చేస్తున్నారు. దీంతో రవాణా, అపై కమీషన్లు, తోటలనుంచి కాయల కోత ఖర్చులు భారీగా పెరిగిపోయి రైతన్నకు భారంగా మారింది. రెండున్న టన్ను సామర్థ్యం ఉన్నా వాహనంలో హైదరాబాద్‌కు రవాణా ఖర్చులు రూ. 18వేలు. బెంగుళూరుకు రూ.12 వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఇక ప్రైవేట్ మార్కెట్లలో నూటికి రూ.10 కమీషన్‌తోపాటు హమాలీ, మార్కెట్ ఖర్చులు రైతుపై భారం పడుతున్నాయి. అన్ని ఖర్చులు పోయి ఏడాది కష్టం కూలీ ఖర్చులు చేతికందుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. నిలకడలేని ధరలు, రవాణా ఖర్చులతో పంట గిట్టుబాటు కాకపోవడంతో ఒకేసారి కాకుండా పలు దఫాలుగా పంటను కోయాల్సి వస్తోంది. పక్వానికి వస్తుండగానే పచ్చివిగానే కోత కోసి ట్రేలలో నింపి ఇతర రాష్ట్రాలకు తరలించే పరిస్థితి వచ్చింది. పంట కోత కోసి మార్కెట్‌కు తరలించే సమయానికి ధరలు తగ్గాయని, నష్టపోయామని వ్యాపారులు రైతులకు ఇచ్చే సొమ్ములో కోత పెడుతున్నారు. రవాణా చేయలేని రైతులు తోటలపైనే వ్యాపారులకు పంటను విక్రయిస్తున్నారు. ఇటీవల జిల్లాలో మహారాష్ట్ర, హైదరాబాద్, కర్ణాటకకు చెందిన వ్యాపారులు రైతుల వద్దకే నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. వేలాది ఎకరాల్లో సాగులో ఉన్న మామిడి పంట విక్రయాలకు జిల్లాలో మార్కెట్ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### మార్కెట్ సౌకర్యం కల్పించాలి



మా గ్రామంలో వంద ఎకరాల్లో మామిడి పంటను సాగు చేశారు. నేను 25 ఎకరాల్లో సాగు చేశా. జిల్లాలో చిన్న మామిడి మండీలు ఉన్నా పంట మొత్తాన్ని కొనుగోలు చేసే సత్తాలేదు. బయటి మార్కెట్లతో పోల్చితే స్థానిక మండీల్లో కిలోకి రూ.10పైగా ధరలు తక్కువగా ఉంటాయి. జిల్లాలో ప్రభుత్వ నిర్వహణలోని మార్కెట్లు లేకపోవడంతో పంటను విక్రయించాంటే కర్ణాటక లేదా హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. రవాణా అద్దెతోపాటు మార్కెట్‌లో కమీషన్, కూలీల ఖర్చులు పోను మా కష్టానికి కూలీ ఖర్చులే మిలుగుతాయి. జిల్లాలో మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతుకు మేలు జరుగుతుంది.

- సూర్యనారాయణరెడ్డి, మామిడి రైతు, పెద్దకడపలవాండ్లపల్లి,తనకల్లు

### పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిందే..



ఐదు ఎకరాల్లో బేనీషా తోపాటు పలు రకాల మామిడి పంట సాగు చేశా. పక్వానికి వచ్చిన కాయాలను పదిరోజుల్లో కోత కోస్తాం. జిల్లాలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో పంటను విక్రయించడానికి దళారులు, వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. లేదంటే అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు మార్కెట్లకు తరలించాలి. రవాణా చార్జీల భారం, ఉన్నట్లుండి ధరలు తగ్గింపుతో ఏడాది కష్టం అంతా రవాణా, మార్కెట్‌లో కమీషన్లు ఖర్చులకే పోతే రైతుకేమి మిగులుతుంది. ప్రభుత్వం జిల్లాలో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చులు, ఇతర ప్రాంతాల్లో దళారుల మోసాల నుంచి మామిడి రైతుకు ఊరట దొరుకుతుంది.

- హేమేంద్ర, మామిడి రైతు, ముదిగుబ్బ

### ప్రతిపాదన దశలో మార్కెట్

జిల్లాలో ఇప్పటికే మామిడి విక్రయాల సందడి మొదలైంది. పది రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పక్వానికి వచ్చిన కాయాలను భారీగా కోస్తారు. జిల్లాలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మామిడి మార్కెట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో పలు ప్రైవేట్ మండీలతోపాటు కొత్తచెరువు మార్కెట్ యార్డులో మామిడి విక్రయాలు జరుతున్నారు. ప్రభుత్వం మామిడి రైతుకు మేలు చేసేందుకు ఆర్గనైజ్‌డ్ మామిడి మార్కెట్ ఏర్పాటు ప్రతిపాదన దశలో ఉంది.

-చంద్రశేఖర్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

## కలింగరకు తమిళనాడు దెబ్బ

### తలకిందులైన ధరలు

**కొనేవారు లేక వదిలేసిన రైతులు**

**ఉచితంగా తీసుకెళుతున్న గ్రామస్థులు**



తోటలోనే మాగుతున్న కాయలు, కలింగర పంట



తాడిమర్రి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నా కలింగరను వ్యాపారులు కొనడం లేదు. తమిళనాడు కాయలు మన రాష్ట్రానికి తక్కువ ధరతో దిగుమతి కావడమే కారణమని రైతులు అంటున్నారు. ప్రస్తుత ధరలకు పంటలను అమ్మితే కూలీల ఖర్చులు కూడా రావని రైతులు తోటలోనే వదిలేశారు. ఉచితంగా తీసుకెళ్లాలని స్థానికులకు చెబుతున్నారంటే రైతు పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని నిడిగల్లు గ్రామానికి చెందిన పవన్, మహేంద్ర రూ.3.50 లక్షలు ఖర్చు చేసి నాలుగు ఎకరాల్లో కలింగర పంట సాగు చేశారు. మంచి మందులు వాడటంతో ఒక్కోకాయ 6 నుంచి 8 కిలోల వరకు దిగుబడి వచ్చింది. మొదటి కోత కిలో రూ.6తో కొనుగోలు చేయగా రూ.60 వేలు వచ్చింది. రెండో కోత కోయాలనుకుంటుండగా 15 రోజులుగా ఏ ఒక్కవ్యాపారి కొనడానికి ముందుకు రావడంలేదు. తామే కోత కోసి మార్కెట్‌కు తరలిద్దామంటే అక్కడ కూడా ధర లేక కూలీలకు అయ్యే ఖర్చు కూడా గిట్టుబాటు కాదని మిన్నకుండిపోతున్నారు. కాయలు అలాగే తోటలోనే ఉంటే పనికిరాకుండా పోతాయని ఆదివారం నుంచి ఉచితంగా తీసుకెళ్లాలని గ్రామస్థులకు రైతులు చెప్పారు. దీంతో శివంపల్లి, నిడిగల్లు, తాడిమర్రితో పాటు పలు గ్రామాలకు చెందిన వారు రైతుల పొలానికి వెళ్లి కాయలను తీసుకెళుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.20 నుంచి రూ.25 అమ్ముతుండగా రైతు వద్ద నుంచి కనీసం రూ.5కు కూడా కొనుగోలు చేసే నాథుడులేరంటే దళారులు, వ్యాపారుల హవా ఎంతగా నడుస్తోందో అర్థమవుతోంది. కాయలు వదిలిపెట్టడం వల్ల రూ.3 లక్షలు నష్టపోయినట్టు రైతులు పేర్కొన్నారు.

### దిగుబడి వచ్చినా ధరలేదు

రూ.3.50 లక్షలు ఖర్చు చేసి నాలుగు ఎకరాల్లో కలింగర సాగుచేశాం. నాణ్యమైన దిగుబడి కూడా వచ్చింది. 15 రోజులుగా పంట ఎదురు చూస్తున్నా. కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. కాయలు ఇప్పటికే పూర్తిగా మాగిపోయాయి. దీంతో కనీసం ప్రజలన్నా తింటారనే ఉద్దేశ్యంతో.. బాధను దిగమింగుకుని ఉచితంగా ఇచ్చేస్తున్నాం. బయట మార్కెట్ కిలో రూ.25 అమ్ముతుండగా మా వద్ద కనీసం రూ.5తో కూడా కొనేవారు లేరు.

- పవన్, రైతు, నిడిగల్లు

## ప్రజలకు.. ప్రభుత్వానికి వారధి ఎన్‌జీజీఓలు

**ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లతోనే కూటమి గెలుపు**

- ఇచ్చిన హామీలన్నీ సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారు
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- స్వేచ్ఛాయుత వాతావరణం కూటమి ప్రభుత్వ చలువే
- ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట-శివారెడ్డి
- జిల్లా కార్యాలయం ప్రారంభం




అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ ఎన్‌జీజీఓ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి ఏపీ ఎన్‌జీజీఓలు వారధి అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సహకారంతోనే గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఏపీ ఎన్‌జీజీఓ జిల్లా కార్యాలయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఏపీ ఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అంతకు మునుపు క్లాక్ టవర్ నుంచి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీ ప్రసంగించారు. వైసీపీ పాలనలో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. సకాలంలో జీతాలు, బకాయిలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమిపై నమ్మకంతో గెలిపించారని, ప్రభుత్వం ఏర్పడ్డాక బకాయిలను ఒక్కొక్కటిగా చెల్లిస్తోందని అన్నారు. సమస్యలపై అన్ని ఉద్యోగ సంఘాల నాయకులతో సీఎం చర్చలు జరుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యోగులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు.

వెలుగులు నింపే ప్రయత్నం: దగ్గుపాటి

వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. డీఏలు, అరియర్స్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర బకాయిలు


(మిగతా 7లో..)


## రేపు మంత్రుల రాక: ఎమ్మెల్యే రాజు

మడకశిర టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత మడకశిర నియోజకవర్గంలో ఈనెల 18వతేదీన పర్యటిస్తారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మడకశిర మండలం వైబీ హళ్లి, కదిరేపల్లి, ఆగళి మండలం ఇనగలూరు, అమరాపురం మండలం శివరంలో సబ్‌స్టేషన్లను ప్రారంభిస్తారని తెలిపారు. రొళ్ల మండలం రంగనపల్లి, గుడిబండ మండలం కేకే పాళ్యం, మడకశిర మండలం గుండుమల గ్రామాల్లో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తారని తెలిపారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

## భక్తిగీతాల ఆలాపనకు శ్రీకారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 1008 భక్తిగీతాల ఆలాపన ప్రారంభించారు. బుధవారం సత్సంగ్ హాల్‌లో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి భక్తిగీతాల ఆలాపనను ప్రారంభించారు. ఈనెల 22వ తేదీ వరకు వారం రోజులపాటు కొనసాగిస్తారు. 900 మంది గాయకులు, 20 భక్తి బృందాలు భజన కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. ఉదయం 9.45 నుంచి రాత్రి 8.45 గంటల వరకు భక్తిగీతాల ఆలాపన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేశ నలుమూలల నుంచి గాయకులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. మొదటి రోజు భక్తిగీతాల ఆలాపనలో 2వేల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు.

## కోర్టుకు కియ కేసు నిందితులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కియ కార్ ఇంజిన్‌ల చోరీ కేసు నిందితులను సిట్ పోలీసులు బుధవారం రాత్రి పెనుకొండ కోర్టు ఎదుట హాజరుపరిచారు. కియ పరిశ్రమ నుంచి 940 కార్ ఇంజిన్‌లు మాయమైన కేసులో ఏడుగురు తమిళులు, ఒక చిత్తూరు జిల్లావాసి పట్టుబడ్డారు. పుంగనూరుకు చెందిన పఠాన్ సలీం, తమిళనాడుకు చెందిన వినాయకన్, మూర్తి, అరుల్‌కుమార్, మోహనరాజ్, మణికందన్, అర్జున్, అక్బర్ ఉన్నారు. వీరిపై 318/4, 316/2, 316/5, 61/1 బీఎన్ఎస్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. వినాయకన్, సలీం కీలక నిందితులని, మిగిలినవారు వీరికి సహకారం అందించినట్టు తెలిసింది. వీరిని కస్టడీ తీసుకుని ఎస్పీ లేద డీజీపీ కార్యాలయంలో విచారిస్తారని సమాచారం. ప్రస్తుతానికి ఇంజిన్‌లను రికవరీ చేయలేదు. అరెస్టయిన ఏడుగురు తమిళనాడుకు చెందిన వ్యక్తుల కుటుంబ సభ్యులు పెనుకొండకు వచ్చారు. కోర్టు వద్ద తమవారిని కలుసుకునే ప్రయత్నం చేశారు. పోలీసులను అడిగి, అరెస్టుకు కారణాలను తెలుసుకుంటూ కనిపించారు.



పెనుకొండ కోర్టు వద్ద నిందితులు, పోలీసులు

# అమ్మలేరు కొనలేరు..






జీమ్లానాయక్ తండా వద్ద రీ సర్వే చేసి.. నాటిన రాళ్లు

- రీసర్వేతో భూములకు సంకెళ్లు
- క్రయవిక్రయాలు వీలుకాక ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న రైతులు

తనకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. అప్పట్లో నిర్వహించిన భూముల రీసర్వేలో అనేక అవకతవకలు జరిగాయి. ఉన్నవి లేనట్లుగా, లేనివి ఉన్నట్లుగా రికార్డుల్లో నమోదయ్యాయి. ఈనేపథ్యంలో తమ భూములు తమ పేరునే ఉన్నాయో.. లేదోననే ఆందోళన అన్నదాతల్లో నెలకొంది. తనకల్లు మండలంలోని ముండ్లవారిపల్లి, వెంకట్రాయునిపల్లి, దండువారిపల్లి గ్రామాల్లో రెండేళ్ల కిందట భూముల రీసర్వే నిర్వహించారు. ఈ రీసర్వేలో అనేక అవకతవకలు జరిగి భూములు ఉన్నవి లేన్నట్లుగా, లేనివి ఉన్నట్లుగా నమోదయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో రెండేళ్లుగా భూములు అమ్ముదామన్నా, కొందామన్నా వీలుకాని పరిస్థితి ఏర్పడింది. మ్యుటేషన్ చేసుకోవాలన్నా వీలుకావడంలేదని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రీసర్వే భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రీసర్వే పూర్తికాని గ్రామాల్లో సర్వే చేయాలని ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆదేశాలిచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు కొత్త గ్రామాల్లో రీసర్వే పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రీసర్వే పేరుతో తమ భూములకు ప్రభుత్వం సంకెళ్లు వేసిందని పలువురు రైతులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైసీపీ పాలనలో భూములకు వేసిన సంకెళ్లను తొలగించాలని ఆప్రాంత రైతులు కోరుతున్నారు.

### పరిష్కారానికి కృషి

రీసర్వేలతో భూముల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తాం.

- శోభా సువర్ణమ్మ, తహసీల్దార్, తనకల్లు

### మ్యుటేషన్ కూడా కావడం లేదు



మాగ్రామంలో రీసర్వే నిర్వహించడంతో రెండేళ్లుగా మ్యుటేషన్లు కూడా కావడం లేదు. భూములకు సంకెళ్లు పడ్డాయి. గతంలో ఆన్‌లైన్‌లో ఉంటే భూములు అమ్మడం, కొనడం చేసేవారు. ప్రస్తుతం అలా చేయడానికి వీలు కాకుండా ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి భూముల అమ్మకాలు, కొనుగోలుకు సహకరించాలి.

- ప్రకాష్‌రెడ్డి, దండువారిపల్లి

### మాగోడు పట్టించుకునేవారే లేరా?



రెండేళ్ల కిందట ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా భూముల రీసర్వే చేశారు. అప్పట్నుంచి భూములు అమ్మడానికి కొనడానికి వీలులేకుండా పోయింది. ఆన్‌లైన్‌లో భూముల వివరాలు తప్పుల తడకగా ఉన్నాయి. అధికారులు తప్పులను సరి చేసి భూములు క్రయవిక్రయాలకు అవకాశం కల్పించాలి.

- వెంకటరమణ, వెంకట్రాయునిపల్లి

### మాగ్రామ భూములన్నీ సమస్యలే..



మా తండాలోని భూములన్నీ సమస్యలే. రీసర్వే చేసినా సమస్యలు పరిష్కారం కాలేదు. రీసర్వేలతో సమస్యలు పరిష్కారమవుతాయనుకుంటే, మరిన్ని పెరిగాయి. అధికారులు, చిత్తశుద్ధితో పనిచేసి సమస్యలు పరిష్కరించాలి.

- రమణనాయక్, జీమ్లానాయక్‌తండా

## పరిశ్రమల స్థాపనతో ఆర్థిక ప్రగతి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. పరిశ్రమల శాఖ పనితీరు గురించి సమీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. నూతన పారిశ్రామికవేత్తలకు ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు బ్యాంకర్లతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమల స్థాపన కోసం చేసుకున్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కర్మాగార చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అత్యవసర పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనడానికి పరిశ్రమలలో భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో రసాయనాల నిల్వల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని సహాని, డీపీఓ సమత, ఎల్‌డీఎం రమణ కుమార్, పరిశ్రమల శాఖ అధికారి కృష్ణమూర్తి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి హేమంతురెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, నాబార్డు అధికారి అనూరాధ, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- వాట్సాప్ గొవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వాట్సాప్ గవర్నెన్స్ ప్రచార గోడ పత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి మనమిత్ర పేరుతో ప్రతి ఇంటికి వెళ్లి వాట్సాప్ గొవర్నెన్స్ గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి పౌరుడి సెల్‌ఫోన్‌లో 9552300009 నంబర్‌ను సేవ్ చేయించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం 210 సేవలు వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో వెయ్యి రకాల సేవలు అందుతాయని తెలిపారు.

## శభాష్ పోలీస్..

### జిల్లాకు ఏబీసీడీ అవార్డు



డీజీపీ నుంచి ఏబీసీడీ అవార్డు అందుకుంటున్న ఎస్పీ రత్న, ఇతర పోలీసు అధికారులు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసుల ఛేదింపులో ప్రతిభ కనబరిచిన జిల్లా పోలీసు యంత్రాంగానికి రాష్ట్రస్థాయిలో రెండోస్థానం దక్కింది. సంచలన కేసులకు సంబంధించి రాష్ట్ర పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా అందించే అవార్డుల్లో భాగంగా 26 సంవత్సరాల కిందట గుడిబండ మండలం చిన్నేహట్టి గ్రామంలో జరిగిన బాలుడి హత్య కేసును ఛేదించిన జిల్లా పోలీసులకు ఏబీసీడీ (నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రదర్శన) అవార్డు, ప్రశంసాపత్రాలను బుధవారం డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా.. ఎస్పీ రత్న పోలీసు బృందానికి అందజేశారు. మంగళగిరిలో ప్రదానం చేశారు. 26 ఏళ్ల క్రితం జరిగిన హత్యకేసు దర్యాప్తులో నైపుణ్యాన్ని చూపిన ఎస్పీ, పెనుకొండ సబ్‌డివిజన్, మడకశిర సర్కిల్ పోలీసుల కృషిని ప్రశంసించారు. రూ.60వేల నగదు రివార్డు అందజేశారు. అవార్డు అందుకున్న వారిలో ఎస్పీతోపాటు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్, ఎస్పీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, అగళి ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది ఉన్నారు.

# డీఎస్సీపై ఉత్కంఠ..!

**ఉమ్మడి జిల్లాలో 807 ఖాళీలని నివేదిక**

**'స్పెషల్' కింద 201 పోస్టుల కేటాయింపు**

**ఆ అభ్యర్థులకు బంపర్ ఆఫర్**

**డైరెక్టరేట్ సమావేశానికి జిల్లా విద్యాశాఖాధికారులు**

అనంతపురం విద్య, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్, పోస్టుల సంఖ్యపై ఉత్కంఠ నెలకొంది. ఎప్పుడెప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తారా అని అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. మరో వారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందన్న ప్రకటనలు వినిపిస్తుండటంతో మరింత ఉత్కంఠ కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 807 ఖాళీలున్నాయని గతంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఇటీవల స్పెషల్ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 201 మంజూరు చేశారు. 'స్పెషల్' పోస్టుల ప్రకటనతో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన అభ్యర్థులకు బంపర్ ఆఫర్ అని ఆయావర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

**ఖాళీలపై గతంలోనే నివేదిక**

ఉమ్మడి జిల్లాలో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వరంగ స్కూళ్లలో మొత్తం 661 ఉపాధ్యాయ పోస్టులు, మున్సిపాలిటీల్లో 146 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు గత ఏడాది నవంబరులోనే కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆమోదం తర్వాత విద్యాశాఖ కమిషనర్‌కు ఖాళీల జాబితాను పంపారు. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి భారీగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపైనే చేశారు. రాష్ట్రంలో 16,347 పోస్టులు భర్తీ చేస్తామని అప్పట్లోనే ప్రకటించారు. గతంలోనే అన్ని జిల్లాల్లో ఖాళీలపై కసరత్తు చేశారు. ఈ ఏడాది మే నెలలో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణను లెక్కలోకి తీసుకుని ఈ ఖాళీలను గుర్తించినట్లు తెలుస్తోంది.

**స్పెషల్ ఖాళీలు**

మెగా డీఎస్సీలో 'స్పెషల్' పోస్టుల మంజూరు చేశారు. కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను మంజూరు చేస్తూ.. విద్యాశాఖ రెండు రోజుల కిందట జీవో జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఎస్‌జీటీ 101 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు మరో 100 వరకూ మంజూరు చేశారు. ఈ పోస్టులు మెగా డీఎస్సీలోనే భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ విడుదలైతేగాని మొత్తం ఖాళీలపై స్పష్టత వచ్చేలా లేదు. డీఎస్సీ ఖాళీలపై చర్చించేందుకు అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు విజయవాడకు రావాలంటూ డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు రావడంతో అనంతపురం జిల్లా అధికారులు కూడా వెళ్లారు.

## చీనీ కాయలు టన్ను రూ.22వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,011 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

## ఉపాధి కూలీలకు ఉచిత బీమా: పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఉచితంగా రూ.2లక్షలు ప్రమాద బీమా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. రాజధాని అమరావతి నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ (సీఆర్‌డీ) కృష్ణతేజ మాట్లాడారు. ఈ విషయాలను డ్వామా పీడీ వెల్లడించారు. వేసవిలో స్థానికంగా జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు కల్పిస్తూ పనిదినాలు పెంచాలని, కనీస వేతనం రూ.307గా చెల్లించాలని తెలిపారు. పశువుల నీటి తొట్టెలకు కేటాయించిన లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలన్నారు. వేసవిలో రోజుకు జిల్లాలో 1.5 లక్షలు పనిదినాలు కల్పించాలని, ప్రస్తుతం 65వేల పనిదినాలు మాత్రమే నమోదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకున్న ఆధార్, మొబైల్ నంబరుతో సమీపంలోని గ్రామ సచివాలయాల్లో ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచిత ప్రమాదబీమా సదుపాయం కోసం కూలీలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 18-59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన జాబ్‌కార్డుదారులందరూ అర్హులని పేర్కొన్నారు. 60 ఏళ్లు దాటిన అనంతరం ఉపాధి కూలీలకు నెలకు రూ.3వేలు పింఛన్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పగలే గొలుసు అపహరణ

గార్లదిన్నె, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడ్డాలపల్లి సమీపంలో బుధవారం పట్టపగలే బంగారం గొలుసును ఓ దుండగుడు అపహరించాడు. నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలిని ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుంటానని నమ్మబలికి ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. వివరాల మేరకు.. గుడ్డాలపల్లికి చెందిన సుబ్బారెడ్డి, నీలావతి దంపతులు వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుధవారం పని నిమిత్తం నీలావతి గార్లదిన్నెకు వచ్చి కూరగాయలు, నిత్యవసరాలు కొనుగోలు చేసుకుని ఆటోలో బయలుదేరింది. 44వ జాతీయ రహదారి గుడ్డాలపల్లి గేట్ వద్ద ఆటో దిగి గుడ్డాలపల్లికి నడుచుకుంటూ వెళుతోంది. అప్పటికే వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును పసిగట్టిన దుండగుడు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంలో వచ్చాడు. అవ్వా.. నేను కూడా అటువైపే వెళుతున్నాను, నిన్ను అక్కడ వదిలిపెడుతానని నమ్మబలికి ఆమెను ద్విచక్రవాహనంలో ఎక్కించుకున్నాడు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు వెళ్లగానే తాను అటువైపు పోలేదని ఆమెను ద్విచక్ర వాహనం నుంచి దింపాడు. వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. బంధువులు, గ్రామస్థులు దుండగుడి కోసం వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దుండగుడి కోసం గాలించారు. పలు చోట్ల సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## క్రిమినల్ కేసు నమోదు

తనకల్లు, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగదిన్నెపల్లికి చెందిన కాయల జనార్దననాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా మతాల మధ్య విభేదాలు సృష్టించేలా వివాదాస్పద పోస్టు పెట్టిన అతడిపై కేసు నమోదుచేసి, తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు చెప్పారు. అతడిపై సైబర్ బుల్లీషీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా ప్రత్యక్షంగాగానీ, సోషల్ మీడియా వేదికగాగానీ, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు తప్పవన్నారు. అలాంటి వారిని బైండోవర్ చేయడంతోపాటు రౌడీ షీట్‌గానీ, సైబర్ బుల్లీషీట్‌గానీ ఓపెన్ చేసి, వారిపై నిఘా ఉంచనున్నట్లు చెప్పారు.



# ప్రజలకు, ప్రభుత్వానికి వారధి ఎన్‌జీజీఓలు

(5వ పేజీ తరువాయి)

ఒక్కొక్కటిగా చెల్లిస్తోందని అన్నారు. డీఏలపై చర్చలు జరుపుతున్నారని, త్వరలోనే అందించే అవకాశం ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు.

**వైసీపీ నాశనం చేసింది: వెంకటశివారెడ్డి**

రూ.30 వేల కోట్ల బకాయిలు పెట్టి ఉద్యోగుల జీవితాలను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటశివారెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మూడు బకాయి డీఏలను విడుదల చేస్తుందనే నమ్మకం తమకు ఉందని అన్నారు. 12వ పీఆర్సీ కమిటీకి చైర్మన్‌ను నియమించిన వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ పీల్డ్ సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్స్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఎంహెచ్ఎం స్కీం ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ఇతర పనులు అప్పజెప్పకుండా చూడాలని కోరారు. ఉద్యోగులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

**వెలుగులు చూడలేమని అనుకున్నాం: విద్యాసాగర్**

చీకటి రోజులను దాటుకుని వెలుగులు చూడలేమని ఉద్యోగులం అనుకున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తమకు భరోసా ఇచ్చిందని ఏపీ ఎన్‌జీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ అన్నారు. డిమాండ్ల సాధన కోసం వైసీపీ ప్రభుత్వం రోడ్డెక్కేలా చేసిందని, అక్రమ కేసులు పెట్టిందని విమర్శించారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పతనానికి, కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు బీజం వేశామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఉద్యోగులకు అండగా నిలుస్తోందని అన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణం కూటమి ప్రభుత్వ చలవేనని అన్నారు. పెండింగ్ ఉన్న మూడు డీఏల్లో కనీసం ఒకటైనా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీఓ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ దస్తగిరి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, ప్రసాద్ యాదవ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి, కార్యదర్శి జవహర్, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రవికుమార్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్, నాయకులు వెంకటేష్‌బాబు, జమీలా బేగం, రవికుమార్, రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, లింగమేష్, మహేష్‌రెడ్డి, శోభారాణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

# ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చేశాయ్..!

**జిల్లాకు 650 కేటాయింపు.. 500 కి.మీ. వైరు సైతం..**

**అనంతకు చేరిన వైనం...**

**రైతులు, వినియోగదారులకు ఊరట**

అనంతపురంరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జిల్లాకు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు వచ్చింది. కొన్ని నెలలుగా వైరు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్న రైతులు, వినియోగదారులకు ఊరట లభించినట్లయింది. సార్వత్రిక ఎన్నికల ముందు నుంచి విద్యుత్ శాఖకు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరా నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం మధ్యలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చినప్పటికీ.. వైరు మాత్రం అందలేదు. దీంతో వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు డబ్బులు కట్టి ఇబ్బందులు పడుతూ వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లినా వైరు లేక కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో రైతులకు సమాధానం చెప్పుకోలేక క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అవస్థలు పడ్డారు. కండక్టర్ ఎప్పుడొస్తుందా అంటూ ఎదురుచూడడం ఆయావర్గాల వంతైంది. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు జిల్లాకు రావడంతో ఆయావర్గాలు హర్షం వ్యక్త చేస్తున్నాయి.

**జిల్లాకు చేరాయి..**

ఇప్పటికే జిల్లా కేంద్రంలోని స్టోర్‌కు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు చేరింది. 650 ట్రాన్స్‌ఫార్మర్లు, 500 కిలోమీటర్ల మేర కండక్టర్ వచ్చింది. ఆ మేరకు జిల్లాలోని మండలాల వారీగా ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లా విద్యుత్ శాఖాధికారి కేటాయించారు. గుంతకల్లు నియోజకవర్గంలోని ప్రాంతాలకు 47, కళ్యాణదుర్గం పరిధికి 105, రాప్తాడు పరిధి మూడు మండలాలకు 40, రాయదుర్గానికి 201, శింగనమల మండలాలకు 94, తాడిపత్రికి 40, ఉరవకొండకు 114 ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించారు. వైరు 500 కిలోమీటర్ల మేర మంజూరైంది. వైరు కొరత తీవ్రంగా ఉండటంతో అవసరం మేరకు కేటాయించనున్నారు.

**మూడు, నాలుగు నెలల్లో సమస్య కొలిక్కి..**

ఎన్నికల కోడ్‌కు ముందు నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరాలో జాప్యం తలెత్తింది. దాదాపు ఆరు నెలలు పూర్తిగా నిలిచిపోయింది. ఆ తరువాత కూడా వైరు సరఫరా టెండర్ ప్రక్రియలో సమస్యలతో సరఫరా ఆగింది. ఈ సమస్య కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లు గతేడాది జూన్ 30వ తేదీ వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు అందించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మార్చి చివరి వరకు ఉన్న దరఖాస్తులకు 1500 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉన్నట్లు సదరు అధికారుల ద్వారా తెలుస్తోంది. వైరు రూ.2వేల కిలోమీటర్ల వరకు అవసరం ఉన్నట్లు జిల్లా ఉన్నతాధికారులు.. సంస్థకు నివేదించారు. విడతల వారీగా సరఫరా అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. మూడు, నాలుగు నెలల్లో ఈఏడాది మార్చి ఆఖరు వరకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ అందించే ప్రక్రియ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు.



విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం స్టోర్స్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

**సీనియారిటీ ప్రకారం అందజేస్తాం**



ప్రస్తుతం అవసరం మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు సరఫరా అవుతున్నాయి. వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను సంబంధిత ఏఈలకు కేటాయించాం. సీనియారిటీ ప్రకారం 2024 జూన్ వరకు పెండింగ్‌లో ఉన్నవారికి వీటిని అందిస్తాం. మరో మూడు, నాలుగు నెలల్లో ఈ ఏడాది మార్చి ఆఖరు వరకు దరఖాస్తుదారులకు అంచనాలు రూపొందించి, పంపిణీ చేస్తాం.

-శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

# వ్యసనాల కోసం గొలుసు చోరీలు

**నలుగురు అంతర్ జిల్లా చైన్‌స్నాచర్ల అరెస్టు**

**19 కేసుల ఛేదింపు...**

**36 తులాల బంగారు నగలు, 3 బైక్‌ల స్వాధీనం**

అనంతపురం క్రైం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నలుగురు అంతర్ జిల్లా చైన్‌స్నాచర్లను అనంతపురం రూరల్, నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వ్యసనాలకు అలవాటుపడిన వారు వాటిని తీర్చుకునేందుకు గొలుసు చోరీలను ఎంచుకుని, కటకటాలపాలయ్యారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జగదీష్.. నిందితుల అరెస్టు వివరాలు వెల్లడించారు.

**అరెస్టయిన వారు వీరే..**

అనంతపురం నగరంలోని రాజీవ్‌కాలనీ పంచాయతీకి చెందిన పంపాచారి అలియాస్ నరేష్, రాయల్ నగర్ వాసి షేక్ షాకీర్, శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడకు చెందిన కంబం నాగార్జున (ప్రస్తుతం అనంతపురంలోని సుఖదేవనగర్‌లో నివాసం), ప్రియాంకనగర్‌కు చెందిన షేక్ ఫజిల్ అహ్మద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పంపాచారి కార్పెంటర్, డ్రైవింగ్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. పేకాట, క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి సంపాదనంతా వ్యసనాలకే ఖర్చు పెట్టేవాడు. షేక్ జాకీర్ కూడా కార్పెంటరే. రాయల్‌నగర్‌లో ఫర్నీచర్ షాపు పెట్టుకున్న ఇతడికి వ్యాపారం సరిగా సాగక అప్పులెక్కువయ్యాయి. వాటిని తీర్చుకోవడానికి చోరీలకు అలవాటుపడ్డాడు. నల్లమాడ నుంచి కంబం నాగార్జున బతుకుదెరువు కోసం ఏడాదిన్నర క్రితం అనంతపురం చేరాడు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. ప్రియాంకనగర్‌కు చెందిన షేక్ ఫజిల్ అహ్మద్ ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలయ్యాడు. అప్పుల వారి ఒత్తిడి ఒక వైపు, పెళ్లి ఖరారు కావడంతో ఖర్చుల కోసం డబ్బులేక ఇబ్బందులు పడ్డాడు. సులభంగా సంపాదించాలనుకున్నాడు. చైన్‌స్నాచింగ్‌లను ఎంచుకున్నాడు.

**మూడు గ్రూపులుగా ఏర్పడి..**

నిందితుల్లో పంపాచారి కీలకం. ఇతడికి కొన్ని నెలల క్రితం షేక్ జాకీర్, కంబం నాగార్జునతో వేర్వేరుగా పరిచయమైంది. స్నేహితులుగా మారారు. పేకాట, ఆన్‌లైన్ జూదం ఆడేవారు. వాటిలో డబ్బు పోగొట్టుకుని చైన్‌స్నాచింగ్‌ల బాట పట్టారు. కాలక్రమంలో ముగ్గురూ స్నేహితులయ్యారు. పంపాచారి ఈ ఇద్దరితో వేర్వేరుగా వ్యవహారం నడిపాడు. తనొక్కడే ముఠాగా, తాను, షేక్ జాకీర్ రెండో ముఠాగా, తాను, కంబం నాగార్జున మూడో ముఠాగా ఏర్పడి ఒకరికి తెలియకుండా మరొకరితో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. ఒంటరి మహిళలను టార్గెట్ చేసేవారు. 2023 నుంచి పంపాచారి కురుగుంట, మన్నీల, రాప్తాడు, కళ్యాణదుర్గం రోడ్డు, గణేష్‌నగర్, లలితానగర్, ఒకటోరోడ్డు తదితర ప్రాంతాల్లో 10 చైన్‌స్నాచింగ్‌లు చేశాడు. రెండో ముఠాగా షేక్ జాకీర్‌తో కలిసి బైక్‌పై వెళ్లి కళ్యాణదుర్గం రోడ్డు, ద్వారకా విల్లాస్‌లో 2 చైన్‌స్నాచింగ్‌లు చేశాడు. కంబం నాగార్జునతో కలిసి హెచ్చెల్సీ రోడ్డు, స్టాలిన్ నగర్, బుక్కరాయసముద్రం చెరువు, బి.కొత్తపల్లిలో నాలుగు స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. మొత్తం 16 కేసుల్లో పంపాచారి నిందితుడు. ఈ కేసుల్లో షేక్ జాకీర్ 2, కంబం నాగార్జున 4 కేసుల్లో నిందితులు. అనంతపురం రూరల్ పీఎస్‌లో 9, బీకేఎస్‌లో 2, ఇటుకలపల్లి పీఎస్‌లో 1, అనంతపురం త్రీటౌన్‌లో 3, రాప్తాడులో 2, ఫోర్త్‌టౌన్‌లో 3 కలిపి మొత్తం 19 కేసులు నమోదయ్యాయి.

**ఆ ఒక్కడే...**

నిందితుల్లో షేక్ ఫజిల్ అహ్మద్ ఒక్కడే చైన్‌స్నాచర్ అవతారమెత్తాడు. ఎవరూ గుర్తుపట్టకుండా తలకు ఎరుపు రంగు క్యాప్, ముఖానికి ఖర్చీఫ్ కట్టుకుని, తక్కువ జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని గొలుసు దొంగతనాలకు పాల్పడేవాడు. హెచ్చెల్సీ సమీపంలో ఓ సచివాలయ ఉద్యోగిని వెంబడించి, ఆమె మెడలోని బంగారు గొలుసు, నాలుగో పోలీసు స్టేషన్ పరిధి ఏఎస్ఆర్ నగర్‌లో వెళ్తున్న ఓ మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లాడు. రాప్తాడు పరిధిలో కార్బన్ సిటీ సమీపంలో ఓ మహిళ మెడలో నుంచి బంగారు చైన్‌ను లాక్కున్నాడు.

**అరెస్టు.. ప్రశంస..**

వరుస చైన్‌స్నాచింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ జగదీష్ ఆదేశాలిచ్చారు. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు శేఖర్, సాయినాథ్, ఇస్మాయిల్, జయపాల్‌రెడ్డి, ఎస్ఐలు రాజశేఖర్ రెడ్డి, రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ప్రసాద్ బృందంగా ఏర్పడి, ఆ పనిలో నిమగ్నమయ్యారు. సమాచారం అందడంతో పోలీసు బృందాలు రాచానపల్లి, రాయల్ నగర్, సుఖదేవ్‌నగర్‌లో చైన్‌స్నాచర్లను అరెస్టు చేశారు. ముఠాలను పట్టుకున్న రూరల్ సీఐ శేఖర్, ఫోర్త్‌టౌన్ సీఐ సాయినాథ్, సీసీఎస్ సీఐలు ఇస్మాయిల్, జయపాల్‌రెడ్డి, ఎస్సీ ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, రూరల్ ఎస్ఐ రాంబాబును ఎస్పీ జగదీష్ అభినందించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

## పరిగిలో భారీ చోరీ

**35 తులాల బంగారం, రూ.40వేల నగదు అపహరణ**

పరిగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటి యజమానులు పుణ్యక్షేత్రాలకు వెళ్లిన సమయంలో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ విద్యానగర్‌లోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగలుపడ్డారు. బాధితుడు శంకరప్ప అందించిన సమాచారం మేరకు.. రెండ్రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లి బుధవారం తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అవాక్కయ్యారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలకొట్టి అందులోని రూ.40వేలు నగదు, 35 తులాల బంగారం దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప చోరీ జరిగిన ఇంటి వద్దకు వచ్చి పరిశీలించారు. సీసీ కెమెరాలు, ఇతర సమాచారం ఆధారంగా విచారణ చేపట్టాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. కాగా, వరుస చోరీలతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. రెండ్రోజుల క్రితం మెయిన్ రోడ్డుపై ఉన్న రెండు దుకాణాలు, ఓ ఇంట్లో చోరీకి తెగబడ్డారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు కాలనీల్లో బీట్ నిర్వహించి చోరీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పోలీసులపై ఎస్పీకి ఫిర్యాదు..!

**గార్లదిన్నె ఎస్ఐ, కానిస్టేబుల్ దాడి చేశారంటూ టీడీపీ నాయకుడి ఫిర్యాదు**

అనంతపురంరూరల్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): తనపై గార్లదిన్నె ఎస్ఐ గౌస్ మహమ్మద్, అదే స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నరేశ్ దాడి చేశారంటూ మండలంలోని కట్టకిందపల్లికి చెందిన టీడీపీ నాయకుడు నాగేంద్ర రెడ్డి ఫిర్యాదు చేశారు. బుధవారం ఎస్పీ జగదీష్‌ను కలసి వినతి పత్రం ఇచ్చారు. నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ.. తన చెల్లెలు లక్ష్మీకుమారిని గార్లదిన్నెకు చెందిన వెంకటనారాయణరెడ్డికిచ్చి వివాహం చేశారన్నారు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు వెంకటనారాయణమ్మ, కృష్ణవేణి ఉన్నారన్నారు. ఈనెల 12వ మామాకోడళ్ల మధ్య చిన్నపాటి గొడవ తలెత్తిందన్నారు. దీనిని అదునుగా చేసుకుని వెంకటనారాయణమ్మ, కృష్ణవేణి వారి తండ్రి వెంకటరామిరెడ్డితో కలిసి ఆస్తి తగాదాల్ని ముడిపెట్టి తన చెల్లెలిని పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లారన్నారు. 'నా చెల్లికి సర్దిచెప్పేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్లాన'న్నారు. స్టేషన్‌లో ఎస్ఐ గౌస్‌మహమ్మద్, కానిస్టేబుల్ నరేష్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమపై దురుసుగా ప్రవర్తించారన్నారు. వెంకట్రామిరెడ్డి, ఆయన పెద్ద కూతురు వెంకటనారాయణమ్మ.. పోలీసుల సమక్షంలో తనపై దాడికి యత్నించారన్నారు. తనపై దాడిని ఆపకపోగా.. తన కాలర్ పట్టుకొని ఎస్ఐ, కానిస్టేబుల్ దాడి చేశారన్నారు. తాను అనారోగ్యం బారినపడి చికిత్స చేయించుకుంటున్నానని చెప్పినా వినకుండా తలపై కొట్టారన్నారు. సర్దిచెప్పేందుకు వెళ్లిన తనపై దాడి చేయడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. తనపై దాడిచేసిన ఎస్ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ముగిసిన కందుల కొనుగోలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కందుల కొనుగోలు ప్రక్రియ ముగిసినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 25 నుంచి జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు చేశారమన్నారు. ఈసారి జిల్లాకు 17వేల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేసేందుకు అనుమతినివ్వగా.. 8,300 మంది రైతులతో 11,485 మెట్రిక్ టన్నుల కందులు మద్దతు ధరతో కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఈనెల 20వతేదీలోగా సేకరించిన కందులను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్దేశించిన గోదాములకు తరలించాలని తెలిపారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

**ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్**

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆ శాఖ ఎస్ఈ సురేష్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో జిల్లాలోని సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ పరంగా అమలు జరుగుతున్న పథకాల గురించి డివిజన్ల వారిగా డీఈలతో సమీక్షించారు. పలు ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయడంలో వెనుకబడిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెన్నిరోజులు కావాలని ప్రశ్నించారు. జలజీవన్ మిషన్ (జేజేఎం) పథకంలో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఆదేశించారు. శ్రీరామిరెడ్డి పథకం ద్వారా సరఫరా చేస్తున్న గ్రామాల్లో నీటి ఎద్దడిపై ఆరా తీశారు. నాలుగు గ్రామాల్లో కొంత ఇబ్బందిగా ఉందని ఎస్ఈ దృష్టికి తెచ్చారు. ట్యాంకర్ల ద్వారా అయినా సరఫరా చేసి అక్కడ నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ మురళీధర్ రావు, డీఈలు రంగయ్య శ్రీరాములు, శ్రీధర్, భూపాల్‌రెడ్డి, సఫ్రీనా, చంద్రశేఖర్‌తో పాటు ఏఈలు, ఏఈఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో ఇద్దరి అరెస్టు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగాటిపల్లి పొలాల్లో మహిళను హత్యచేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. కేసు ఛేదింపు వివరాలను ఆయన బుధవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి వెల్లడించారు. మండలంలోని రావులచెరువు గ్రామానికి చెందిన చిట్రా అక్కమ్మను చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం వాసి బాళ్ల గంగన్నకిచ్చి 30 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. అక్కమ్మ 27 ఏళ్ల క్రితం భర్త, పిల్లలను వదిలేసి పుట్టిల్లు రావులచెరువుకు చేరుకుంది. వ్యవసాయ కూలి పనులకు వెళ్తుండేది. ఏడేళ్ల తరువాత ధర్మవరంలోని తిక్కస్వామినగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని, అక్కడే ఉంటుండేది. ఈనేపథ్యంలో గతనెల 16న సాయంత్రం 5.45 గంటల సమయంలో అక్కమ్మను కళాజ్యోతి సర్కిల్ వద్ద ఆటో నడుపుకునే షెక్షావలి, తలారి లోకేంద్ర ఆటోలో ఎక్కించుకుని రేగాటిపల్లి పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ తలారి లోకేంద్ర, అక్కమ్మ మధ్య చిన్నపాటి గొడవ తలెత్తింది. అది కాస్తా.. పెద్దది కావడంతో కోపోద్రిక్తుడైన లోకేంద్ర.. షెక్షావలి సాయంతో అక్కమ్మ తలపై రాయితో బలంగా మోది, ఆపై తనవద్దనున్న చాకుతో గొంతు కోసి, ముఖం గుర్తుపట్టకుండా చర్మం కోసి హతమార్చారు. ఎస్పీ రత్న.. హత్యాస్థలాన్ని పరిశీలించి, కేసును సీరియస్‌గా తీసుకున్నారు. త్వరగా ఛేదించాలని సిబ్బందిని ఆదేశించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు.. సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం సీతారంపల్లి జాతీయ రహదారి వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది బాబ్‌జాన్, రాజప్ప, షాకీర్, అనిల్‌కుమార్, రాఘవేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ చత్రూనాయక్, రామాంజనేయులును ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

## న్యూస్ బాక్స్

### రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ఎస్సీ కులానికి చెందిన లబ్ధిదారులకు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ సాయిమనోహర్ బుధవారం తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 32 వివిన్న పథకాల్లో ఈ రుణాలు ఇస్తామన్నారు. 21 నుంచి 50 సంవత్సరాలలోపు వారు అర్హులని, వచ్చేనెల 10లోపు ఆన్‌లైన్‌లో ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● కదిరి : తలుపుల మండలంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు స్వయం ఉపాధి కోసం రుణాలు పొందడానికి అర్హులన్నారు. మే 10లోపు దరఖాస్తులు ఆయా సచివాలయాల్లో అందచేయాలని సూచించారు. దరఖాస్తుకు ఆధార్, కుల ధ్రువీకరణ, రేషన్‌కార్డు జిరాక్స్ జతపరచాలన్నారు.

### కంప్యూటర్ శిక్షణ

కదిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి వెబ్ డైవలపర్ కోర్సు ప్రారంభిస్తున్నామని, ఇందుకు 10, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులని అన్నారు. శిక్షణాంతరం వీరికి ఉద్యోగం కూడా కల్పిస్తామన్నారు. వివరాలకు 93901 75421ను సంప్రదించాలన్నారు.

### రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

ధర్మవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడేశ్వరి సేవాసమితి, జాతీయసేవా పథకం సంయుక్తంగా రక్తగ్రూప్ నిర్ధారణ, రక్తపోటు పరీక్షల శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 120 మంది రక్త గ్రూపు నిర్ధారణ చేయించుకున్నారు. ఇందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూనిట్ ప్రోగ్రాం అధికారి గోపాల్ నాయక్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అశోక్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

కదిరిఅర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత కండెక్టర్ కుళ్లాయప్ప మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అంతిమక్రియలకు కుళ్లాయప్ప కుటుంబానికి రూ. పది వేలు అందచేసినట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి బాషా తెలిపారు. ఆయన వెంట నరసింగరావు, సభ్యులు ఉన్నారు.

### దిన, వారపు సంతల వేలం

కొత్తచెరువు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంత, దినపు సంత, బస్టాండ్, సులభ కాంప్లెక్‌లకు పంచాయతీ అధికారులు బహిరంగ వేలం పాటను బుధవారం నిర్వహించారు ఇందులో వారపు సంత రూ.7,17,500లకు ఎం.వెంకటేశ్, దినపు సంత రూ.2.63 లక్షలకు నాగేంద్ర, బస్టాండ్ రూ.4.24 లక్షలకు శ్రీనివాసులు దక్కించుకున్నారు. సులభ్ కాంప్లెక్స్‌ను రూ.40,100 పెనుకొండ శివ వేలం పాటలో దక్కించుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నటరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం తనిఖీ చేశారు. ఆయన ప్రజలకు అందుతున్న సేవలు, ఇటీవల చేపట్టిన సర్వేలపై పురోగతిపై ఆరాతీశారు. మనమిత్ర పేరుతో వాట్సాప్ ద్వారా అందిస్తున్న సేవలపైఅవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ రాబర్టువిల్సన్, కార్యాలయ పర్యవేక్షకుడు రమణనాయక్, సిబ్బంది పద్మనాభరెడ్డి, శ్రీనివాసాచారి ఉన్నారు.

### సకాలంలో టీకాలు వేయించుకోండి

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలని సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ సూచించారు. బుధవారం స్థానిక వివేకానంద రోడ్డు, చిత్రావతి రోడ్డులో వ్యాధి నిరోధక టీకాలు, తల్లిపాల విశిష్టత, వడదెబ్బ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు తప్పకుండా పట్టించాలన్నారు. ఎండలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, అంజుల, అనుపమ, ఆశాకార్యకర్తలు మంజుల, కాంతమ్మ, నాగరత్న, ఉమ, కుమారి, రత్న పాల్గొన్నారు.

### పౌష్టికాహారంపై అవగాహన

తనకల్లు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లి 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, సాయిలక్ష్మి, పద్మావతి, మాధవి, మంజుల, మగ్బుల్, తల్లులు, పిల్లలు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ధర్మవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని జేఆర్ శిల్క్‌లో అగ్నిప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రాధికారి రాజు ఆధ్వర్యంలో గ్యాస్, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఆర్పే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల అందజేత

ధర్మవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని 270 మంది విద్యార్థులకు పాఠ్య, నోట్‌పుస్తకాలను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పెద్దన్న, హాజీపీరా, ప్రభాకర్, మల్లికార్జున పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జీఎల్ నరసింహులు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని అన్నారు. గత సంవత్సరం 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద జీవోలు విడుదల చేయాలన్నారు. అనంతరం ఇన్‌చార్జీ మున్సిపల్ కమిషనర్ సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో తిరుపాల్, బాలక్రిష్ణ, జనార్థన్, చెన్నక్రిష్ణ రామాంజులు, లక్ష్మణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

### దెబ్బతిన్న అరటిపంట పరిశీలన

తాడిమర్రి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నదరి గ్రామానికి చెందిన ఆకుల రంగనాయకులు, హరికు చెందిన 16 ఎకరాల్లోని అరటిపంట ఇటీవల గాలివానకు దెబ్బతింది. ఆ పంటను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి జయరామాంజినేయులు, మోహన్‌గౌడ్, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, రాజశేఖర్, శ్రీనివాసులు ఉన్నారు.

# కడుపునింపని ఉపాధి

- రెండు నెలలుగా అందని బిల్లులు
- ఆర్థిక ఇబ్బందుల్లో కూలీలు
- సౌకర్యాల కల్పనలోనూ నిర్లక్ష్యం
- పథకంపై నిరాసక్తి
- తగ్గుతున్న కూలీల సంఖ్య
- టార్గెట్ల పేరుతో సిబ్బందిపై ఒత్తిళ్లు
- రూ.కోట్లలో మెటీరియల్ బిల్లులూ పెండింగ్


▲ బిల్లులు మంజూరు కాని గోకులం షెడ్


ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు →

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాయకష్టం చేసినా .. ఫలితం దక్కకపోవడంతో ఉపాధి కూలీలు నిరాశలో ఉండిపోయారు. రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఓడీసీ మండలంలో 8,833 జాబ్ కార్డులున్నాయి. ఇందులో 15,975 మంది పనికి హాజరు కావాల్సి ఉండగా.. కేవలం 1,710 మంది మాత్రమే హాజరవుతున్నారు. అలాగే అమడగూరు మండలంలో 5,713 జాబ్‌కార్డులుండగా, 10,735 మందికిగాను 955 మంది, నల్లమాడ మండలంలో 8,230 జాబ్‌కార్డులు ఉండగా 14,360 మందికి గాను 1,746 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. వచ్చిన వీరికి కూడా ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు వేతనాలు రాలేదు.

● అందని మెటీరియల్ బిల్లులు..

మెటీరియల్ పేమెంట్ కింద హార్టీకల్చర్, గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, మల్బరీ షెడ్లకు గాను ఓడీసీ మండలానికి రూ.4,80,65,294, అమడగూరు మండలానికి రూ. 1,78,13,132, నల్లమాడ మండలానికి రూ.3,12,76,185 నిధులు రావాల్సి ఉంది. రూ.కోట్లులో మెటీరియల్ బిల్లులు రాకపోవడంతో ఉపాధి పథకం పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం కూలీ లు, రైతుల ఇబ్బందులను గుర్తించి సకాలంలో వేతనాలు, మెటీరియల్ డబ్బులు అందించాలని కోరుతున్నారు.

● సౌకర్యాలు నిల్

ఒక పక్క ఎండలు మండుతున్నా పని ప్రదేశాల్లో అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో పనులకు వెళ్లిన కూలీలు కూడా వెనుతిరుగుతున్నారు. పని సమయంలో 35 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలుండటం.. కనీసం నీడ సౌకర్యం కూడా కల్పించకపోవడంపై కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● తగ్గుతున్న కూలీల సంఖ్య

రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో పనులు చేసేందుకు కూలీలు ఆసక్తి చూపడంలేదు. క్రమంగా కూలీల సంఖ్య తగ్గుతోంది. ఏటా ఏప్రిల్‌లో ప్రతికూలీకి వంద రోజుల పనిదినాలు వస్తుండడంతో కూలీల సంఖ్య సాధారణంగా పెరగాల్సి ఉంది. కూలీలకు వేతనాలు రాకపోవడం.. ఎండలు తీవ్రంగా ఉన్నా సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆ సంఖ్య తగ్గుతోంది

● అధికారులకు టార్గెట్ తిప్పలు

కూలీల శాతం తగ్గుతుండడంతో అధికారులకు టార్గెట్ తిప్పలు తప్పడంలేదు. ఉన్నతాధికారులు మాత్రం టార్గెట్లు ఇస్తూ ప్రతిఒకరికి పనులు కల్పించాలని క్షేత్రస్థాయిలో సాంకేతిక, క్షేత్ర సహాయకులు వెళ్లి అవగాహన కల్పించాలని చెబుతున్నారు. వారు విశ్వ ప్రయత్నాలు చేసినా, అనుకున్న టార్గెట్ పూర్తి చేయలేకపోతున్నారు. కూలీల సంఖ్య తగ్గడానికి వేతనాలు ఇవ్వకపోవడమే ప్రధాన కారణమని ఉన్నతాధికారులకు తెలిసినా.. టార్గెట్ల పేరుతో ఒత్తిళ్లు తెస్తుండడంతో సిబ్బంది దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

#### అప్పులు చేసి నిర్మించా



పాడి ఆవుల సంరక్షణ కోసం మినీ గోకులాన్ని అప్పులు చేసి నిర్మించారు. ఇంతవరకు బిల్లులు పడలేదు. వడ్డీలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నా. అధికారులు, ప్రభుత్వం స్పందించాలి.

-కిష్టప్ప, పాడిరైతు, ఆకుతోటపల్లి

#### కుటుంబ పోషణ భారం



కాయకష్టం చేసినా, డబ్బులు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. 8 వారాలుగా కూలి డబ్బులు రావాల్సి ఉంది. మా ఇబ్బందులు గుర్తించి.. అధికారులు బిల్లులు చెల్లించాలి.

-లక్ష్మీనారాయణ, శేషయ్యగారిపల్లి

#### వారంలోపు బిల్లులు జమ చేస్తాం

కూలీలకు బిల్లుల బకాయిలు వాస్తవమే. వారంలోపు కూలీల బిల్లులు జమ అవుతాయి. మెటీరియల్ బిల్లులు కూడా ఈనెలాఖరులోపు విడుదల అవుతాయి. కూలీలు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

- వేణుగోపాల్, డీపీపీ జిల్లా కో-ఆర్డినేటర్

## ఘనంగా చౌడేశ్వరీదేవికి జ్యోతులు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అమడగూరులో చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జ్యోతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ రథ పల్లకిని పలురకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మాజీ జడ్పీటీసీ పొట్టా పురుషోత్తమరెడ్డి రథోత్సవాన్ని ఆలయం వద్ద ప్రారంభించారు. జ్యోతికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పుణ్యాహవచనం, శాంతి పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతిని ఎత్తుకుని అమ్మవారి రథం ముందు ఊరేగింపును ఆలయం వరకు నిర్వహించారు. ఈ ఉత్సవానికి మండల ప్రజలేకాక కర్ణాటక భక్తులూ అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి నిర్వహించిన ఆర్కెస్ట్రా, సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


సమస్య వింటున్న ఎమ్మెల్యే కందికుంట

## తాగునీటి సమస్య రాకూడదు

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కందికుంట

నంబులపూలకుంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'మండలంలోని ఏ గ్రామంలో తాగునీటి సమస్య ఉండకూడదు. సమస్య ఉంటే వెంటనే మండల నిధులు ఖర్చు చేసినా ఆ సమస్య పరిష్కరించండి.' అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అంజనప్ప అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజలు నుంచి ఫిర్యాదు స్వీకరించారు. మండలంలోని సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాలేరు, నగరి సుజల స్రవంతి, సోలార్ హబ్‌తో భూములు నష్టపోయిన రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. ఇందులో తహసీల్దార్ దేవేంద్రనాయక్, సర్పంచ్ అంజనమ్మ, ఎంపీపీ రాము, నాయకులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

### కోర్టు ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారులు


కదిరిలీగల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):న్యాయవాదుల సంఘం కోర్టు ఆవరణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీన్ని న్యాయాధికారులు ఎస్ ప్రతిమ, మీనాక్షి సుందరి బుధవారం ప్రారంభించారు. ఇందులో కదిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు


శివపార్వతులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక గాండ్లవీధిలోని శివ పంచాయతన దేవాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖిల గాండ్ల సంఘం ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు మనోహర శాస్త్రి తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణం నిర్వహించారు.

### ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

గాండ్లపెంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. తమకు 2016 నుంచి జీతాలు పెంచలేదని వాపోయారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమను ఫీల్డ్ అసిస్టెంట్లుగా.. జీతాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రసాద్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, నాగరాజు, జయరాం, వీరాంజులనాయక్ పాల్గొన్నారు.

### బీజేపీలో పలువురి చేరిక

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోట గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆదెప్ప, కోటప్ప, వారి అనుచరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు ఆధ్వర్యంలో వారు ఆ పార్టీలో చేరారు.

### ఆర్డీటీ సేవలు అమూల్యం: ఎమ్మెల్యే పరిటాల


బుద్ధిమాంద్యం పిల్లలతో ఎమ్మెల్యే పరిటాల సునీత


కదిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కొనియాడారు. తిరుపతి నుంచి తిరుగు ప్రయాణంలో బుధవారం కదిరి పట్టణానికి సమీపంలోని ఆర్డీటీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడున్న బుద్ధిమాంద్యం, మెదడు పక్షపాతానికి గురైన పిల్లల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆ పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఇంతమంది పిల్లలను ఆర్డీటీ చేరదీయడం చాలా గొప్పవిషయమన్నారు. అక్కడి సిబ్బంది శ్రద్ధ, ఓపికను ఆమె అభినందించారు.

### కార్బైడ్ ఉపయోగిస్తే కఠిన చర్యలు: జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ


పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పండ్లను మగ్గపెట్టడానికి కార్బైడ్ తదితర రసాయనాలను ఉపయోగిస్తే.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ అభిషేక్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆహార సంరక్షణ, ప్రమాణాల చట్టం అమలుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడి, అరటి, బొప్పాయి, దానిమ్మ, సపోటా తదితర పండ్లను కృత్రిమ పద్ధతిలో మగ్గపెట్టాలని, రసాయనాలను ఉపయోగించడం చట్టరీత్యా నేరమని అన్నారు. పండ్లను మగ్గపెట్టే వ్యాపారులపై ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తామన్నారు. ఎవరైనా రసాయనాలు ఉపయోగించినట్లు తేలితే.. వారికి రూ.లక్ష జరిమానా, ఆరునెలలు జైలు శిక్ష తప్పందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, ఆహార భద్రతాధికారులు తస్నీమా, రామచంద్రగౌడ్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానవనశాఖాధికారి చంద్రశేఖర్, పుట్టపర్తి కమిషనర్ ప్రహ్లాదా పాల్గొన్నారు.

### సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త


మాట్లాడుతున్న డీసీపీఓ మహేష్

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని డీసీపీఓ మహేష్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పుట్టపర్తి డివిజన్‌స్థాయి మతపెద్దలతో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలు, యువత మొబైల్‌కు బానిసలు కాకుండా కాపాడుకోవాలన్నారు. వారి మీద పెద్దలు నిఘా వేసి ఉంచాలన్నారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఇందులో చిల్డ్రన్ ఆఫ్ ఫౌండేషన్ ఇండియా జిల్లా కో- ఆర్డినేటర్ కొండప్ప, చిల్డ్రన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్, సోషియల్ వర్కర్ ఆనంద్, మతపెద్దలు జామియామసీద్ ఇమాం మహబూబ్‌బాషా, ఇర్షాద్, ఉమర్‌ఫరూక్, అబ్దుల్‌ఖయ్యూమ్, మన్సూర్, తజముల్ పాల్గొన్నారు.

### ఊరిస్తున్న మేఘాలు



గాండ్లపెంట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నా... ఒక్క చినుకు కూడా పడలేదు. ఎండ వేడిమి అధికమై ఉక్కపోతలో అల్లాడుతున్న ప్రజలు ఆ మేఘాల వైపు ఆశగా చూస్తున్నారు. సెల్‌కు వాతావరణ కేంద్రం నుంచి మీ ప్రాంతాలో పిడుగులు పడతాయని.. మెరుపులతో కూడిన వర్షం వస్తుందని మేసేజ్‌లు వస్తున్నాయే తప్ప.. చినుకు జాడ లేక.. ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

## క్రైం న్యూస్..

### ఆటోడ్రైవర్ ఆత్మహత్య


బాషా (ఫైల్)

ధర్మవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కేతిరెడ్డికాలనీ వాసి, ఆటో డ్రైవర్ దూదేకుల బాషా (20) అప్పుల బాధతో ఉరేసుకొని మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. బాషా చెడు అలవాట్లకు, కుటుంబ పోషణకు దాదాపు రూ.5 లక్షలు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక మంగళవారం అర్ధరాత్రి జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులు ఈ విషయాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాషా భార్య మసూద్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

### తల్లి, కుమారుడి అదృశ్యం

బత్తలపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తన భార్య సాయిలక్ష్మి, చిన్న కుమారుడు ప్రశాంత్ కనిపించడం లేదని మండలంలోని వెంకటగారిపల్లికి చెందిన హరికుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హరికుమార్‌కు పదేళ్ల క్రితం కొత్తచెరువు గ్రామానికి చెందిన సాయిలక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. హరికుమార్ బేల్దార్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం హరికుమార్ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. భార్య, చిన్న కుమారుడు కనిపించకపోవడంతో వారి కోసం గాలించాడు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

### గుడిగంటల చోరీ


గంటలు లేని ఆలయం

కొత్తచెరువు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పైలేపల్లి ఆంజనేయస్వామి గుడిలోని మూడు గంటలను దుండగులు మంగళవారం రాత్రి చోరీ చేశారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గ్రామస్థులు గుర్తించారు. 15, 10, 5 కేజీల బరువున్న గంటలు చోరీ అయ్యాయని, వాటి విలువ సుమారు రూ. 20 వేలు ఉంటుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

## రైతు సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రైతులకు 1బి అడంగల్ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ తహసీల్దార్ నారాయణస్వామిని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన, టీడీపీ నాయకులు, రైతులతో తహసీల్దార్‌ను కలిశారు. రీసర్వే ప్రక్రియలో భాగంగా రైతులకు 1బి అడంగల్ ఆన్లైన్‌లో రావడం లేదని, రైతులు పంట రుణాల రెన్యువల్‌కు ఇబ్బందులు పడుతున్నారని, తహసీల్దార్ మ్యానువల్‌గా ఇచ్చినా 1బి అడంగల్ బ్యాంక్ అధికారులు అంగీకరించడం లేదని అన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. బ్యాంక్ అధికారులు, వీఆర్వో, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని, సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లె నారాయణస్వామి, తుమ్మల సూరి, బాలకృష్ణ, బాలరాజు, బాలచంద్ర, కరుణాకర్, వెంకటనారాయణ, వెంకటపతి పాల్గొన్నారు.

### శ్మశాన వాటిక స్థలం పరిశీలన

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ శ్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురవుతోందని పలు ఫిర్యాదు అందాయి. దీనికి స్పందించిన ఆర్డీఓ సువర్ణ బుధవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అనంతచారికి సూచించారు. ఆమె వెంట ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, వీఆర్ఓలు శ్రీలత, బాలప్ప, సర్వేయర్లు వెంకటేష్, శ్రీనివాసులు ఉన్నారు.


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఆర్డీఓ

న్యూస్ బాక్స్

## నిండిన కొండూరు చెరువు

ఆనందంలో రైతులు



మరువ పారుతున్న కొండూరు చెరువు

లేపాక్షి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కొండూరు రైతుల కల ఇప్పటికి నెరవేరింది. ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రైతులకోసం ప్రత్యేక చొరవచూసి కృష్ణాజలాలతో చెరువులు నింపింది. దీంతో మండలంలో మొట్టమొదటిసారిగా కొండూరు చెరువుకు నీటిని వదిలారు. జలాలతో నిండిన చెరువు బుధవారం మరువపారింది. దీంతో రైతుల ఆనందానికి అవధులులేవు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చెరువు మరువపోయింది. తరువాత వైసీపీ ప్రభుత్వం కృష్ణాజలాలపై నిర్లక్ష్యం వహించడంతో నీరు రాలేదు. తిరిగి ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో నీటిని వదలడంతో చెరువు మరువపారింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

-పరామర్శించిన నాయకులు

పరిగి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన టీడీపీ నాయకుడు జేసీబీ చౌడప్ప(64) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ బీకే పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకుడు వెంకటేశ్వర్లు ఆయన భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతిప్రసాద్, వడ్డె హనుమయ్య నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

## స్కూల్ స్థలం ఆక్రమణకు యత్నం: ఎంఈఓ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సోమందేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సప్తగిరి కాలనీలో ఉన్న మండల పరిషత్ ఆదర్శ పాఠశాల ముందున్న ఖాళీ స్థలాన్ని స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాడని ఎంఈఓ అంజనేయులునాయక్ తెలిపారు. బుధవారం ఆయన స్కూల్‌ను సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల స్థలంలో విద్యార్థులు ప్రేయర్ నిర్వహిస్తారన్నారు. ఆ స్థలం తనదేనని తనకు పట్టా ఉందని ఓ వ్యక్తి అడ్డు తగిలాడన్నారు. దీంతో విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. సదరు వ్యక్తివద్ద ఏ ఆధారాలున్నాయో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

## భక్తిశ్రద్ధలతో సంకష్ట చవితి వ్రతాలు

పెనుకొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సంకష్ట చవితిని పురస్కరించుకుని అర్చకులు రామచంద్రశర్మ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి దంపతులచేత వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

## 'ఫిజియోథెరపీకి తీసుకురండి'

సోమందేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ స్కూల్‌లోని భవిత కేంద్రానికి విభిన్న ప్రతిభావంతులను క్రమంతప్పకుండా ఫిజియోథెరపీ పరీక్షలకు తల్లిదండ్రులు తీసుకురావాలని బుధవారం ఎంఈఓలు అంజనేయులు నాయక్, ఆనంద్‌బాబు తెలిపారు. భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంప్‌లో సమగ్ర శిక్ష ద్వారా చక్రాల కుర్చీ, ట్రైసైకిల్, రోలేటర్స్, 14 టీచింగ్ అండ్ లర్నింగ్ మెటీరియల్‌ను బుధవారం వారు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు నాగరాజు, ఐసీడీఎస్ ఉద్యోగి రవికుమార్, ప్రత్యేక ఉపాధ్యాయులు లింగరాజు పాల్గొన్నారు.

## ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ

పెనుకొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయప్ప జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలను అధిరోహించాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనిధి, యశోదరాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని శవం లభ్యం

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పరిటాల డిగ్రీకళాశాల ఆవరణంలో గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు బుధవారం కళాశాల సిబ్బంది తెలిపారు. స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఈదురుగాలులకు నేలకూలిన పంటలు



నేలకూలిన అరటి తోట

చిలమత్తూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు వివిధ రకాల పంటలు, చెట్లు నేలకొరిగాయి. సంజీవరాయునిపల్లి సమీపంలో చెట్లు రోడ్డుకి అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు నేలకొరిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

## శాంతియుతంగా జీవించండి: డీఎస్పీ

చిలమత్తూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఘర్షణలకు తావులేకుండా శాంతియుతంగా జీవించాలని ప్రజలకు హిందూపురం డీఎస్పీ మహేష్ సూచించారు. మండలంలోని దేమకేతేపల్లి గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ఆయనతోపాటు హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ ముస్తీర్ అహమ్మద్ గ్రామంలో గ్రామస్థులతో సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్‌కి సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# రుణాల మంజూరులో జాప్యం

నెలలు గడుస్తున్నా లభించని వైనం

కార్యాలయం చుట్టూ సంఘాల సభ్యుల ప్రదక్షిణ




లేపాక్షి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధిని మెరుగుపరుచుకోవడానికి, ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో శ్రీనిధి ఫెడరేషన్ ద్వారా వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేస్తుంటారు. రుణాన్ని వారు స్వయం ఉపాధికి ఉపయోగించి తిరిగి నెలనెలా సక్రమంగా వాయిదాల పద్ధతిలో చెల్లించాలి. అలాంటి రుణాలు స్వయం ఉపాధి మహిళలకు గ్రూప్ తరుపున డాక్యుమెంట్స్ సమర్పించిన రెండు రోజుల్లోనే రుణాలు మంజూరు చేయాలి. అయితే లేపాక్షి మహిళ నందీశ్వర మండల సమాఖ్యలో నెలలు గడుస్తున్నా రుణాలు మంజూరు చేయడం లేదని సభ్యులు వాపోతున్నారు. మండల సమాఖ్యలో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా గ్రూపులు పర్యవేక్షించడం లేదని దీంతో మండల వ్యాప్తంగా దాదాపు 130గ్రూపులు సరిగా జరగక నిలిచిపోయాయని అధికారిక లెక్కలుచెబుతున్నాయి. సక్రమంగా జరిగే గ్రూపులకు సకాలంలో రుణాలు అందించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించి మహిళల జీవనోపాధి పెంచాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

### రుణాలు సక్రమంగా అందేలా చూస్తాం

మండలంలో 130 గ్రూపులు సక్రమంగా జరగలేదని నా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరిపి సిబ్బంది గ్రూపుల సమావేశం నిర్వహించి సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకుంటాం. శ్రీనిధిరుణాల మంజూరులో జాప్యం ఎక్కడుందో విచారించి చర్యలు తీసుకుంటాం. మహిళల అభ్యున్నతికి చేయూతనిచ్చేలా సిబ్బందిని సక్రమంగా పనిచేసేలా చూస్తాం.

-రామిరెడ్డి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్

## సమస్యల పరిష్కారానికి కృషిచేయండి

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీపీ అంజనేయులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్

సోమందేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషిచేయాలని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీపీ అంజనేయులు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని ప్రసంగించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆ అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువచేసి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణపల్లిలో లోవోల్టేజి సమస్యను పరిష్కరించామన్నారు. తహసీల్దార్ మారుతి మాట్లాడుతూ మండలంలోని పది గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని మరో పది గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. ఉమ్మడి భూములకు సంబంధించిన వివాదాలు తలెత్తే మునుపే పేరుచేసుకోవాలని సూచించారు. డీలర్లు సకాలంలో రేషన్ పంపిణీ చేపట్టి సమయపాలన పాటించాలన్నారు. పోర్టబులిటీకింద వలస దారుల కార్డులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. స్టార్ట్ అయిపోతే పది శాతం అదనంగా ఇస్తామన్నారు. ఏపీఎం మదన్‌మోహన్ మాట్లాడుతూ స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న మహిళలు తీసుకున్న రుణాలతోపాటు మైక్రోఫైనాన్స్ వద్ద అప్పులు చేస్తున్నారన్నారు. వారు అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నారన్నారు. సోమందేపల్లిలో 150మంది పారిశ్రామిక వేత్తలకు రూ.కోటి వరకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ముద్ర రుణాలు సైతం అందజేయడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ ఈశ్వరయ్య మాట్లాడుతూ సోమందేపల్లి స్మశానానికి దారి ఏర్పాటు చేయాలన్నారు. ఏఓ కవితారాణి మాట్లాడుతూ ప్రతిరైతు ఫార్మర్ ఐడీని తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు పండించిన పంటలకు విక్రయాలకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. మాగేచెరువు సర్పంచ్ నరసింహులు మాట్లాడుతూ తమ పంచాయతీలో 76 గృహ లబ్ధిదారులకు సంబంధించి సిమెంటు, బిల్లులను అక్రమంగా కాజేశారన్నారు. న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ పాల్గొన్నారు.

## మండల సమావేశానికి సభ్యుల గైర్హాజరు

గోరంట్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరుచేసిన 15వ వార్షిక సంఘం నిధులు రూ.85లక్షలు ఖర్చుచేసే విషయంలో ఏకాభిప్రాయం కుదరగా అధికారులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి నిర్వహించలేని పరిస్థితి గోరంట్లలో నెలకొంది. మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించగా ఎంపీపీ ప్రమీలతోపాటు 21 మంది సభ్యులు సమావేశానికి రాకపోవడంతో బుధవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే. బుధవారం కూడా ఇదే పరిస్థితి పునరావృతం కాకుండంతో ఎంపీడీఓ నరేంద్ర కుమార్ మళ్లీ 90 రోజులకు సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టారు. తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ, పలువురు మండలస్థాయి, వివిధశాఖల అధికారులు, కార్యదర్శులు రెండుగంటలపాటు సభ్యుల రాకకోసం వేచిచూశారు. రాకపోయేసరికి సమావేశంనుంచి వెళ్లిపోయారు.

## దరఖాస్తు చేసుకోండి: ఎంపీడీఓ

అమరాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామారావు కోరారు. ఈనెల 14వతేదీ నుంచి మే 10వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని ఆయన తెలిపారు.

## విద్యార్థినికి మంత్రి నారా లోకేశ్ అభినందన



ల్యాప్‌టాప్ అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

హిందూపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో మంచి ఉత్తీర్ణత సాధించిన పేద విద్యార్థిని నీరుగంటి వాణిని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఒకేషనల్ సీఈటీ గ్రూప్ 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించింది. రాష్ట్రస్థాయిలో ర్యాంక్‌ని సాధించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ విద్యార్థినిని అభినందించారు. బహుమతి కూడా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అనూరాధ అధ్యాపకులు వాణిని అభినందించారు.

## 'ఉద్యోగ భద్రత కల్పించండి'

పెనుకొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పనిచేస్తున్న వర్కర్స్ ఎంప్లాయిస్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు ఆర్డీఓ ఆనంద్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించకుండా తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేసేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ బాబావలి, చిన్నవెంకటేశ్, నరసింహ, చంద్ర, వెంకటేశ్, లక్ష్మీదేవి, నరసమ్మ, సాయి, రిక్షా నరసింహ, జబ్బార్, ఆరిఫ్ పాల్గొన్నారు.

## సీఎంకు కృతజ్ఞతలు

చిలమత్తూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగేలా షెడ్యూల్డ్ కులాల వర్గీకరణకు మంత్రి వర్గ ఉప సంఘం ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మాదిగ, మాదిగ ఉపకులాల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ తెలిపారు. ఆయన గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఎస్సీల అభ్యున్నతికి సీఎం కృషి చేయడం హర్షణీయమన్నారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గుడిబండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కె.పాళ్యం గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిలు టీడీపీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈనెల 18వతేదీన శంకుస్థాపన చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటైతే విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని సబ్‌స్టేషన్‌కు స్థలం అందజేస్తున్న రైతులతో చర్చించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, నాయకులు దుర్గేష్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, ప్రకాష్, కొంకల్లు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## పోషకాహారంపై అవగాహన

రొళ్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో బుధవారం సీడీపీఓ నాగమల్లీశ్వరి, సూపర్‌వైజర్ ఎం.నన్నక్క పోషకాహార ప్రదర్శనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సలహా మేరకు ఎన్ఆర్‌సీ (న్యూట్రీషియన్ రెహబిషన్ సెంటర్)కు రెఫర్ చేసే పద్ధతిపై వివరించారు. పౌష్టికాహారం పరిశుభ్రత, ఆహారం తయారీ, ఉపయోగించే పద్ధతులపై అవగాహన కల్పించారు.


## ఆర్థిక సంఘం సమావేశానికి ఎంపిక



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, ఏప్రిల్ 16( ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరగనున్న 16వ ఆర్థిక సంఘ సమావేశానికి వెళ్లనున్నట్లు హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి.ఈ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గురువారం తిరుపతిలో జగరనున్న సమావేశానికి రాష్ట్రం నుంచి 15 మంది సభ్యులు ఎన్నికయ్యారన్నారు. ఇందులో కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్లు ఉన్నారన్నారు. రాయలసీమ నుంచి ముగ్గురిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయగా, తాను హిందూపురం నుంచి వెళ్తున్నానన్నారు. మున్సిపాలిటీల సమగ్ర ప్రగతిపై సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు రామచంద్ర, సతీష్, అయూబ్, అంజలి, ఇర్షాద్, ముస్తాక్, రహమత్ బీ, నాయకులు నవీన్, వెంకటేష్ రెడ్డి, షఫీ తదితరులు ఉన్నారు.

## ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేస్తాం: గుండుమల



తిప్పేస్వామికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఎంటీఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని ఎంటీఎస్ ఉపాధ్యాయులు మడకశిరలో గుండుమల తిప్పేస్వామిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 25ఏళ్ల తరువాత తమకు ఉద్యోగం ఇచ్చినా సరియైన న్యాయం జరుగలేదన్నారు. పూర్తిస్థాయిలో వేతనాలు, 62 ఏళ్లకు రిటైర్మెంట్ అయ్యేలా చూడాలన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా వారికి గుండుమల తిప్పేస్వామి హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు కేపీ చంద్రాచారి, శ్రీనివాసులు హనుమంతరాయుడు, ఎంఎస్ కృష్ణమూర్తి తిప్పేస్వామి, నరసింహమూర్తి పాల్గొన్నారు.

## రంగనాథుడిని దర్శించుకున్న మాజీ మంత్రి

సోమందేపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి రంగనాథస్వామి ఆలయాన్ని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఉషశ్రీచరణ్ బుధవారం సందర్శించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి: ఎస్ఎఫ్ఐ

గుడిబండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుడిబండ, గుండుమల వద్ద నిర్మిస్తున్న ఎంజేపీ కళాశాల భవనాలను త్వరితగతిన పూర్తిచేసి ఆపాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరేష్ ఒక ప్రకటనలో కోరారు. గుడిబండ ఎంజేపీ కళాశాల విద్యార్థినులు ఇరుకు గదుల్లోనే విద్యాభ్యాసం చేసి వందశాతం ఉత్తీర్ణత సాధించడం ఎంతో అభినందనీయం అన్నారు. విద్యార్థినులకు కళాశాల భవనాలను నిర్మించి చదువుకొనేందుకు అన్ని సౌకర్యాలను సత్వరమే కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఉపాధి కూలీల హాజరు శాతాన్ని పెంచండి

గుడిబండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించి కూలీల హాజరుశాతాన్ని పెంచాలని ఏపీడీ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం గుడిబండ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా కూలీలకు పనులు కల్పించి వలసలు పోకుండా నివారించాలన్నారు. ఉపాధి సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు అందేవిధంగా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ శివన్న, ఈసీ జగదీష్, టీఏలు లోకేష్, తిరుమలగౌడ్, సతీష్, పవిత్ర, తదితర ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వండి

- డీఎస్పీని కోరిన టీడీపీ నాయకులు



డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కియా కార్లపరిశ్రమ, దాని అనుబంధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు పట్టణంలో అద్దెకు ఉన్నారని, అయితే వారందరికీ యాజమాన్యంతో చర్చించి గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా చూడాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు డీఎస్పీ నరసింగప్పను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీని టీడీపీ నాయకులు కలిశారు. పెనుకొండ పట్టణంలో కార్మికుల ముసుగులో అనుమానితులు తిరుగుతున్నారని, ఈ నేపథ్యంలో కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తే సమస్య ఉండదన్నారు. ఇటీవల పట్టణంలో దొంగతనాలు ఎక్కువయ్యాయని వాటిని అరికట్టేవిధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

## కోరంలేక మండలమీట్ వాయిదా

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండలమీట్‌కోరంలేక వాయిదాపడింది. బుధవారం 10గంటలకు మండలపరిషత్ కార్యాలయానికి ఎంపీపీ నాగమ్మ, ఎంపీడీఓ రాంకుమార్, ఎంపీపీ నాగమ్మ, మండలంలోని వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు. మండలంలో 14మంది ఎంపీటీసీలకుగాను ఆరుగురు హాజరయ్యారు. సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు 18నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో సమావేశంలో ఎంపీడీఓను నిలదీశారు. అనంతరం హాజరైన ఎంపీటీసీ సభ్యులు తమకు 18నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు. ఎంపీడీఓ రాంకుమార్ కోరం లేక వాయిదావేశారు.

## 'అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం'



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఎస్ఐ వెంకటేశులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఎస్ఐ వెంకటేశులు తెలిపారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలువురు మహిళలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో సిలెండర్‌లో మంటలు వ్యాపిస్తే ఎలా ఆర్పాలి..? తదితర వాటిపై డెమోచేసి చూపించారు.


హిందూపురం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లలో నివాసం ఉంటున్న వారు గ్యాస్ లీక్ అయినప్పుడు ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక అధికారులు తెలియజేశారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు పట్టణంలోని పాండురంగనగర్‌లో ఉన్న అపార్టుమెంట్లలో సిలిండర్ల గ్యాస్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ గ్యాస్ లీకైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వంట గదిలో పెట్రోల్, కిరోసిన్ నిల్వ ఉంచరాదన్నారు. గ్యాస్ లీకైనప్పుడు ఇంటిలో ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయరాదన్నారు.

## ఘనంగా కనుమమారమ్మ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

మడకశిరటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కనుమ మారమ్మ ఉత్సవాలు బుధవారం రెండవ రోజు అత్యంత వైభవంగా సాగాయి. కొల్లాపురమ్మ దేవాలయం ఆవరణంలో కనుమ మారమ్మ అమ్మవారి అక్కాచెల్లెళ్లు అయిన ముత్యాలమ్మ, వడినలమ్మ, కొల్లాపురమ్మ అమ్మవార్లకు వేకువజామునుంచే విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పోతులరాజు ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. పట్టణ వాసులతో కలిసి నృత్యం చేశారు. కాగా అమ్మవార్లకు పలువురు ముస్లింలు చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించారు.



పట్టణ వాసులతో కలిసి నృత్యం చేస్తున్న గుండుమల తిప్పేస్వామి

## చట్టాలపై అవగాహన అవసరం

పెనుకొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉన్నపుడే సమాజంలో స్వేచ్ఛగా జీవించవచ్చని దుర్గాశక్తి సొసైటీ జిల్లా ఉపాధ్యక్షురాలు ముంతాజ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ పాఠశాలలో టింబక్టివ్ కలెక్టివ్ ఆధ్వర్యంలో ముంతాజ్ అధ్యక్షతన ఉచిత న్యాయసేవ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మాయిలు అబ్బాయిలతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కుటుంబంలో మహిళలు బాల్య వివాహాల నిర్ణయాధికారం గురించి ఒక నాటిక ద్వారా తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం అసోసియేట్ రవళి, పావని, మహాశక్తి సీతజ, రమేజ, లక్ష్మీదేవి, ముంతాజ్, లక్ష్మమ్మ, కృష్ణమ్మ, గీత, నాగమ్మ, మహిళా పోలీస్ రిహానా తదితరులు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణుల ఆందోళన

గోరంట్ల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): తమ ఉపాధి అవకాశాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని బుధవారం నాయీబ్రాహ్మణులు నిరసన తెలిపారు. గోరంట్లలోని ఓ రెస్టారెంట్ వారు ఇతర రాష్ట్రాలకు చెందిన వర్కర్లను పిలిపించి కొత్తగా హేర్‌కట్టింగ్ సెల్యూన్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగభూషణ, నాగరాజు ఆధ్వర్యంలో సమావేశమై కొత్తగా ఏర్పాటు చేయనున్న రెస్టారెంట్ ముందు నిరసనను తెలిపారు. ఈవిషయంపై అధికారులు చర్యలు తీసుకుని తమకులవృత్తికి రక్షణ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.